క్లుప్తంగా

బోనాల వేడుకలకు తోడ్పాటు

అంబర్‌పేట: నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తనవంతు చేయూతను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట మహంకాళి ఆలయానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే అందించారు. నియోజకవర్గంలో ఉన్న ప్రధాన ఆలయాలకు ఇప్పటికే ప్రభుత్వం తరపున చెక్కులను పంపిణీ చేశామన్నారు. దేవాదాయ శాఖ ఏఈ బాలాజీ, దేవస్థాన సేవా సమితి ప్రతినిధి శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, మల్లికార్జున్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, సీహెచ్ సుధాకర్, కిశోర్, స్థానిక నాయకులు నర్సింహరెడ్డి, చంద్రమోహన్ తదితరులున్నారు.

'మంగళంపల్లి'కి భారతరత్న ప్రకటించాలి

చిక్కడపల్లి: సుప్రసిద్ధ గాయకులు డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణకు భారతరత్న ప్రకటించాలని వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ అన్నవరపు రామస్వామి అన్నారు. శుక్రవారం త్యాగరాయగానసభలో ప్రముఖ సంగీతజ్ఞుడు పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 93వ జయంత్యుత్సవం జాతీయ వాయిద్య కళాకారుల సంఘం ఆక్లాండ్‌కు చెందిన సంగీత భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామిని బాలమురళీ స్మారక జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 98 ఏళ్ల వయసులో తాను నగరానికి రావడానికి కారణమిదేనన్నారు. మురళీకి భారతరత్న అవార్డును కేంద్రం ప్రకటించాలని ఆకాంక్షించారు. గాయకుడు మోహనకృష్ణకు పద్మ పురస్కారాలు కేంద్రం ప్రకటించాలని కోరారు. హైదరాబాద్ బ్రదర్స్ , వంశ రామరాజు, డాక్టర్ మంచుకొండ రంగయ్య, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రభాకర్, వేముల శ్రీనివాస్, ఎల్‌వీ. రమణ, నాగేష్, సురేందర్, రవి పాల్గొన్నారు.

లాల్‌దర్వాజ అమ్మవారికి ప్రత్యేక పూజలు



చేనేత పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: పాతబస్తీ లాల్‌దర్వాజ సింహవాహిని దేవాలయం 115వ వార్షికోత్సవం సందర్భంగా మేకలబండ నుంచి గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు స్వహస్తాలతో వేసిన పోచంపల్లి చేనేత పట్టువస్త్రాన్ని అమ్మవారికి సమర్పించారు. శుక్రవారం ఒగ్గు కళాకారులు, డప్పు చప్పుళ్లతో 200 మంది నృత్యకళాకారుల భారీ ఊరేగింపుతో మేకలబండ నుంచి అమ్మవారి దేవాలయంలో బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌యాదవ్ కార్పొరేటర్ దంపతులను స్వాగతించి సన్మానించారు. బీజేపీ నాయకులు అనిల్ కుమార్, అలె జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

కాచిగూడ: అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద విద్యార్థులు మానవహారం చేపట్టారు. రాష్ట్రంలో ఉన్న విద్యావ్యవస్థని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర లా ఫోరం కన్వీనర్ విద్యానగర్ జిల్లా కన్వీనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. 1200 మంది విద్యార్థుల ఆత్మబలిదానంతో ఏర్పడిన రాష్ట్రం కేవలం ఓ కుటుంబమే లబ్ధి పొందిందని విమర్శించారు. ఆగస్టు 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో లక్ష మందితో విద్యార్థుల సింహగర్జన బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏబీవీపీ నేతలు సాయిప్రసాద్, ఉదయ్, వినయ్, విష్ణు, కార్తిక్, ప్రణయ్‌కమల్, సాయితేజ, ఉదయ్, రాజ్, మహేందర్, సాయితేజ, మనీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

అంబర్‌పేట: చదువుల్లో రాణించడం లేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట చెన్నారెడ్డినగర్‌కు చెందిన దయానంద్ కుమారుడు రవితేజ(20) డీడీ కాలనీలోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో చదువుతున్నాడు. రెండో సంవత్సరం ఫలితాల్లో ఒక సబ్జెక్ట్ తప్పడంతో అప్పటి నుంచి మానసికంగా కృంగిపోయాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో ఉన్న తల్లికి చిప్స్ ప్యాకెట్ తీసుకురావాలని బయటకు పంపించి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. బయటకు వెళ్లిన తల్లి ఇంటి తలుపులు తట్టగా రాకపోవడంతో బలంగా నెట్టి చూసేసరికి అప్పటికే ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉద్యానవనాల సుందరీకరణ

ఎంఎస్‌ఆర్ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



ఎంఎస్‌ఆర్ పార్కులో అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాల్సిన ఉద్యానవనాలు గతంలో పచ్చదనం కానరాక ఎడారుల్లా మారాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నియోజకవర్గంలో రోజూ పాదయాత్రలు చేపట్టిన సమయంలో స్థానికులు అధ్వాన్నంగా ఉన్న పార్కులను అభివృద్ధి చేయించాలని కోరారన్నారు.

- ఉద్యానవనాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పార్కుల దుస్థితిని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి ఆదేశాలు, చొరవకు కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలోని పార్కుల సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు.
- రూ. కోటి నిధులతో నల్లకుంట టీఆర్టీ కాలనీలో గల మోతె నాగేశ్వర్‌రావు (ఎంఎస్‌ఆర్) పార్కు సుందరీకరణ పనులను చేపట్టామన్నారు. శుక్రవారం నల్లకుంట టీఆర్‌టీ కాలనీలోని ఎంఎస్ ఆర్ పార్కును సందర్శించిన ఎమ్మెల్యే సుందరీకరణ పనులను పరిశీలించారు.
- పార్క్ మెయిన్ గేట్ ఆర్చ్ నిర్మాణం, ఫౌంటెన్ ఏర్పాటు, పూల మొక్కలు నాటడం, పచ్చిక బయళ్ల ఏర్పాటు, వృద్ధులు మహిళలు సేదతీరేందుకు సిమెంట్ బల్లల ఏర్పాటు, వాకింగ్ పాత్, ఫెన్సింగ్, పిల్లల ఆటల పరికరాలు తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులపై ఉద్యానవనశాఖ అధికారులు, కాంట్రాక్టర్, సిబ్బందికి అభివృద్ధిపై ఆయన పలు సూచనలు చేశారు.
- ఈ సుందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. గతంలో నియోజకవర్గంలోని పార్కులు ఎలాంటి అభివృద్ధికి నోచుకోక అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిపోయాయన్నారు.
- ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రస్తుతం నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లు పార్కుల అభివృద్ధి, సుందరీకరణపనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పార్కుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చాలా వరకు చివరిదశకు చేరాయన్నారు. త్వరలోనే వాటిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. జీహెచ్ఎంసీ ఉద్యానవన విభాగం అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



నిర్మాణంలో పిల్లల ఆటల పరికరాలు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత..



కాచిగూడలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బందితో కలిసి శుక్రవారం కాచిగూడ, గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వీధి చివర్లో ఉండే చెత్త కుండీలు, బస్తీల్లో ఉంటున్న డంపింగ్‌యార్డుల వద్ద పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

- డ్రైనేజీ పైపులైన్ల నిర్వహణను మరింత మెరుగుపరచాలని మురుగునీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు.
- తాగునీటి నల్లాల్లో కలుషితనీరు రాకుండా చూడాలని సూచించారు. ప్రజలందరూ పరిశుభ్రతను పాటిస్తే దేశమంతా పరిశుభ్రంగా ఉంటుందన్నారు.
- చెత్తను రిక్షాల్లోనే వేసి బస్తీలు, కాలనీలలో పరిశుభ్రతలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా కాచిగూడ డివిజన్‌లోని వైఎంసీఏ, లింగంపల్లి చౌరస్తా, కుద్బిగూడ, చెప్పల్‌బజార్, గోల్నాక న్యూ బ్రిడ్జి, జిందా తిలిస్మాత్ రోడ్డు, డీ-మార్ట్ లైన్, వడ్డెర బస్తీ, తులసినగర్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ వేణుగోపాల్, డాక్టర్ జ్యోతిబాయి, ఈఈ పేరిరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్

కవాడిగూడ: భోలక్‌పూర్‌లో అధ్వానంగా మారిన రోడ్లను ఆధునీకరిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని కరిమీయా మసీద్ నుంచి హిందూ ధర్మచరణ సమితి శ్మశానవాటిక వరకు రూ.30 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

- రూ.21లక్షలతో కరీమియా మసీదు వద్ద డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పూర్తి చేశామని భోలక్‌పూర్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక రోడ్లను ఆధునీకరించామన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు శరీఫ్, రహీం, మైనార్టీ డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, చాంద్, సబీల్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

ముషీరాబాద్: మహంకాళి దేవాలయ బోనాల ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శుక్రవారం శివాలయం చౌరస్తా నుంచి పోతరాజుల నృత్యాలు, ఘటాల ఊరేగింపు మధ్య ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ముఠా జైసింహ, ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్, దేవాదాయ శాఖ ఈఓ జ్యోతి, చంద్రమౌళి, బీఆర్ఎస్ నాయకులు నవీన్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ఆలయ కమిటీ ధర్మకర్తలు పూసగోరఖ్‌నాథ్, రాజు, రూపాశ్రీ, గౌరీశంకర్ చైర్మన్ శ్రీధర్‌చారి, లక్ష్మీగణపతి ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్, వై.శ్రీనివాస్‌రావు, శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

కృష్ణానగర్‌లో పోచమ్మకు బోనాలు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని కృష్ణానగర్‌లో పోచమ్మ ఆలయ పునః ప్రారంభోత్సవం సందర్భంగా బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం బస్తీ కమిటీ అధ్యక్షుడు వై.శాంతికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.నాగేష్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు జగదీష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, గజ్జెల సూర్యనారాయణ తదితరులున్నారు.

డిజైన్ ఎడ్యుకేషన్‌పై ఒప్పందం

కాచిగూడ: ఇంటర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్, మేధావి స్కిల్స్ యూనివర్సిటీ, ఎన్ఎస్‌డీసీ సంస్థలు డిజైన్ ఎడ్యుకేషన్‌పై శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఐఎన్ఐఎఫ్‌డీలో ఒప్పందం కుదుర్చుకున్నాయి. మేధావి స్కిల్స్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు, చాన్స్‌లర్ ప్రవేశ్ దుదాని, ఐఎన్ఐఎఫ్‌డీ గ్లోబల్ సీఈఓ అనిల్ ఖోస్లా, బాలీవుడ్ నటుడు అమన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ కింద ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైన్‌లో వినూత్న ప్రోగ్రామ్‌లు అందించనున్నట్లు ప్రకటించారు. దేశంలో డిజైన్ విద్యలో విప్లవాత్మక మార్పులను కొనసాగిస్తుందన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థినీల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కర్ణాటక శిక్షణ సమితి అధ్యక్షుడిగా సుదేందర్ కులకర్ణి

కాచిగూడ: కర్ణాటక శిక్షణ సమితి అధ్యక్షుడిగా సుదేందర్ కులకర్ణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమితి కార్యదర్శి ముకుంద్ కులకర్ణి ప్రకటించారు. టెక్కల్‌కోటే రామమూర్తి మరణించడంతో నూతన అధ్యక్షుడిగా సుదేందర్‌ను కర్ణాటక శిక్షణ సమితి గవర్నింగ్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సుదేందర్‌ను అభినందించారు.

పోలీస్‌స్టేషన్లలో సదుపాయాల కల్పనకు కృషి



మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్, సిబ్బంది

కాచిగూడ: పోలీసులు ఒత్తిడిని అధిగమిస్తూ.. ధీటైన సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సదుపాయాలను కల్పించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. శుక్రవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో శ్రీశ్యామ్‌మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను సీవీ ఆనంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని పోలీస్‌స్టేషన్లకు అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మిస్తున్నామన్నారు.

- ప్రతి పోలీస్‌స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్‌స్టేషన్లకు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం వల్ల ప్రజలు, పోలీసు సిబ్బందికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు లిఫ్టలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.
- పోలీస్ స్టేషన్లలో లిఫ్టుల ఏర్పాటుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో శ్రీ శ్యామ్ సేవా సమితి లిఫ్ట్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునిల్‌దత్, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, కాచిగూడ ఏసీపీ ఆకుల శ్రీనివాస్, కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు, అడ్మిన్ ఎస్సై నరేష్, వీరమల్లయ్య, సురేష్‌కుమార్, చంద్రకాంత్ అగర్వాల్, సెక్రటరీ ఇంద్రకరణ్ అగర్వాల్, రాందేవ్ అగర్వాల్, రాజ్‌కుమార్‌విగ్, పంకజ్ అడుక్యా, కపిల్ అగర్వాల్, నరేంద్రకుమార్ గోయల్, నర్సింగ్ జైస్వాల్ తదితరులున్నారు.

ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ: దేశంలో ఉపాధి లేక ఎంతో మంది నిరుద్యోగ యువత నిరాశతో ఉన్నారని యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం దోమలగూడ లిబర్టీ ఆప్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నరేష్‌యాదవ్, వినయ్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో 100 మందితో కలిసి ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో పాటు ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, ఎంఏ మజీద్, డాక్టర్ హరిచరణ్‌లు పార్టీలో చేరారు. దేశాభివృద్ధికి యువత రాజకీయాల్లోకి రావడం చాలా ముఖ్యమని పార్టీలో సముచిత స్థానం కల్పించి ప్రోత్సహిస్తామన్నారు. మద్ది పరమేష్, స్వామి, బొబ్బలి జనార్దన్, రోహన్‌యాదవ్, సాయినాథ్, బంధు, నాగార్జున, ఆదిత్య, వంశీ, రాకేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది ఆరోగ్యానికి కృషి



ఉచిత వైద్య శిబిరంలో మధుకర్‌స్వామి

అంబర్‌పేట: పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండేందుకు పోలీస్ విభాగం ప్రాధాన్యతను ఇస్తుందని అంబర్‌పేట పోలీస్ శిక్షణాకేంద్రం ప్రిన్సిపల్ పి.మధుకర్‌స్వామి తెలిపారు. శుక్రవారం శిక్షణ కేంద్రంలో లైన్స్ క్లబ్‌గ్రీన్‌ల్యాండ్స్ కిమ్స్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారంతో పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ పిచ్చయ్య, ఏఓ రామారావు, వైద్యులు డాక్టర్ గులాబ్ రాణి, లయన్ విద్యాభూషణ్, డాక్టర్ లక్ష్మీకుమారి, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, డాక్టర్ భాగ్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి 'మోకుదెబ్బ' జిల్లా మహాసభలు

కాచిగూడ: బీసీ కులవృత్తులకు అందిస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం పథకంలో గౌడ కులస్తులను చేర్చాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ డిమాండ్ చేశారు. గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18 నుంచి ఆగస్టు 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జిల్లా మహాసభలను నిర్వహించి ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించారు. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా గౌడ కులస్తులందరూ ఐక్యంగా కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాగుల సిద్ధిరాములుగౌడ్, బాలరాజ్‌గౌడ్, ముత్యం నర్సింహులు, బండారి రమేష్, బాలేశం, సురేష్, ఉమేందర్, శ్రీనివాస్, రమేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం



శిక్షణా శిబిరం ముగింపులో ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు

కాచిగూడ: ఆర్టీసీ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని సంస్థలో పనిచేసే కార్మికులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి సంస్థను లాభాల బాటలో నడిపించాలని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు కార్మికులకు సూచించారు. ఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం కాచిగూడ ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ కార్మికుల పనితీరుపై ఆర్టీసీ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా బస్సు సేవలను అందించడంలో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర కీలకమన్నారు. బస్సులు సక్రమంగా పనిచేసేలా చూసే మెకానిక్, సూపర్‌వైజర్ల పాత్ర అత్యవసరమన్నారు. ఉద్యోగులు, కార్మికులు బాధ్యతాయుతంగా పనిచేసి సంస్థకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపి, కాచిగూడ, బర్కత్‌పుర డిపోల మేనేజర్లు తదితరులున్నారు.

పార్లమెంట్‌లో బీసీ , మహిళా బిల్లు పెట్టాలి



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 21 ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఆయన ఛలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభాగణనలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, జాతీయ ప్రధాన కార్యదర్శి నందగోపాల్, భూపేష్‌సాగర్, రాజ్‌కుమార్, అంజి, సుధాకర్, సతీష్, నిఖిల్, ఉదయ్, శివ పాల్గొన్నారు.

మహిళా బిల్లును ప్రవేశపెట్టాలి..

ముషీరాబాద్: వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లుతో పాటు మహిళా బిల్లును కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 24,25న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జాతీయ బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు డాక్టర్ అనూసూరి పద్మలత అధ్యక్షతన మహిళా సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. మహిళా బిల్లు ప్రవేశపెట్టి బీసీ మహిళలకు సబ్ కోటా కలిగించినప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు జనాభా ప్రకారం సబ్‌కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను నిలిపేందుకు 19 చట్టాలు వచ్చినప్పటికీ వారిపై అత్యాచారాలు తగ్గడం లేదన్నారు. మహిళల రక్షణకోసం మరిన్ని చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, వెంకటేష్, రామకృష్ణ, సతీష్, సుభాషిణి, శరత్‌కుమార్, శ్రీనివాస్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి



కేవీపీఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జే.బీ.రాజు



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని సీఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు గత కొద్ది రోజులుగా ప్రభుత్వమే వేతనాలకు బడ్జెట్ కేటాయించాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ సిబ్బంది వల్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా సమానంగా చెల్లించాలన్నారు. కారోబార్, కలెక్టర్లకు సహాయ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జీవో నెంబర్ 51ని సవరించాలని డిమాండ్ చేస్తూ.. సమ్మె కొనసాగిస్తున్నారన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. గత 10 రోజులుగా సాగుతున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సిబ్బంది, జేఏసీ నాయకత్వంలో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. జూలై 18న నియోజకవర్గ కేంద్రంలో కార్మికులతో మహా ప్రదర్శన చేసి ఎమ్మెల్యేలకు సామూహిక వినతిపత్రాలు ఇస్తామన్నారు. 19న రాజకీయ పార్టీలు ట్రేడ్ యూనియన్‌లు ప్రజాసంఘాలతో కలిసి మండల కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. జూలై 20న కుటుంబ సభ్యులతో దీక్ష చేయాలని అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమ కార్యచరణ చేపడతామని తీర్మాణించారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి యజ్ఞనారాయణ, కన్వీనర్లు వెంకటరాజన్, దాస్, అరుణ్, శివబాబు, సదానందం, చాగంటి వెంకటయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన సమ్మెపై వివక్ష తగదు..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రామ పంచాయతీ సిబ్బంది న్యాయమైన సమ్మెపై వివక్షత తగదని వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ప్రముఖ అంబేడ్కర్‌వాదీ జే.బీ.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బంది గత 9 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ పంచాయతీ ఉద్యోగుల్లో 80 శాతం మంది దళితులే ఉన్నారని వివరించారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధాని స్వచ్ఛ భారత్, కేసీఆర్ పచ్చదనం, పరిశుభ్రత పిలుపును చిత్తశుద్ధితో అమలు చేశారన్నారు. గ్రామీణ ప్రజల జీవన విధానంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు.

- ఎన్నికల ముందు గ్రామ పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎం.దశరథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లులక్ష్మి, గిరిజన సంఘం కార్యదర్శి శ్రీరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.